www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 01 జనవరి 2023 | 5 | కాకినాడ





కడియపులంక సత్యదేవ(అబ్బులు) నర్సరీలో విరులతో న్యూఇయర్‌కు స్వాగతం

సుఖ సంతోషాలతో

ఆనందంగా ఉండాలి..

జిల్లా ప్రజలకు కలెక్టర్ కృతికా శుక్లా నూతన సంవత్సర శుభాకాంక్షలు



ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రజలందరి జీవితాల్లో సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు నింపే సంవత్సరంగా 2023 ఉండాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, పరిశ్రమలు.. ఇలా అన్ని రంగాల్లోనూ కాకినాడ జిల్లా మరింత అభివృద్ధి సాధించాలని.. ఈ దిశగా ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో కృషిచేసేందుకు అధికార యంత్రాంగం అహర్నిశలు కృషిచేస్తుందని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధిలో కీలక మైలురాయిగా గత సంవత్సరం వేదికగా నిలిచిందన్నారు. నూతన సంవత్సరం మరిన్ని విజయాలకు నాంది కావాలని కాంక్షించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని కుటుంబాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని కలెక్టర్ ప్రజలను కోరారు.

-అత్యంత పారదర్శకంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా ఖరీఫ్ కు సంబంధించి ఇప్పటి వరకు 2.15 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రూ. 426.49 కోట్లకు గాను ఇప్పటికే రూ. 352.60 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో జమయ్యాయన్నారు.. కొత్త సంవత్సరం రైతుల జీవితాలకు ఆనందమయం కావాలన్నారు

- రోవర్లు, డ్రోన్లు వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ చట్ట పరిధిలో అత్యంత జాగ్రత్తగా ఇప్పటికే జిల్లాలో 121 గ్రామాల్లో సమగ్ర భూసర్వే పూర్తి చేసి, రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రస్తుతం మరో 39 గ్రామాల్లో రీసర్వే జరుగుతోందన్నారు.

- ఈ భాషా నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంపొందించేందుకు ప్రత్యేక నిపుణుల బృందంతో రైజ్ మాడ్యూల్‌ను ఇప్పటికే తుని నియోజకవర్గంలో విజయవంతం చేసి, కాకినాడ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో అమలుచేస్తున్నామన్నారు.

- అక్టోబర్ 28న కాకినాడలో ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టి) దక్షిణాది క్యాంపస్ ఏర్పాటైందన్నారు. ప్రభుత్వం కేటాయించిన 25 ఎకరాల్లో క్యాంపస్ నిర్మాణం కానుందని తెలిపారు.

- తొండంగి మండలంలో దాదాపు రెండు వేల ఎకరాల్లో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుతో పారిశ్రామికంగా, ఉపాధి అవకాశాల పరంగా, ఫార్మా రంగంలో రాష్ట్రం ముందంజలో ఉంటుందన్నారు.

- ఏలేరు సాగునీటి వ్యవస్థ ఆధునీకరణకు ఫేజ్-1 పనులు 142 కోట్లు, ఫేజ్-2 పనులకు మరో 150 కోట్ల నిధుల మంజూరును ముఖ్యమంత్రి ప్రకటించారని, ఏలేరు-తాండవ అనుసంధాన ప్రాజెక్టుకు ఇటీవలే ఆయన శంకుస్థాపన చేశారన్నారు. జల్ జీవన్ మిషన్‌తో 2024 నాటికి జిల్లాలోని అన్ని ఆవాసాల్లో ఇంటింటికీ తాగునీటి సరఫరా జరుగుతుందన్నారు.

- 100 కోట్ల నిధులతో ఆధునీకరిస్తున్న కాకినాడ యాంకరేజ్ పోర్టు తూర్పు తీరంలో దేశ ఎగుమతి, దిగుమతులకే కాక, ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ 30 వేల మంది కార్మికులకు ఉపాధి కల్పించనుందని కలెక్టర్ తెలిపారు.

- కోవిడ్ మహమ్మారి మారు వ్యాపిస్తుండటంతో దానిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లాలో అన్ని వ్యవస్థలను సంసిద్ధం చేస్తున్నామన్నారు. ఈ అనుభవాలతో ప్రజలంతా కోవిడ్ నిరోధ జాగ్రత్తలు తప్పని సరిగా పాటించాలని కలెక్టర్ కృతికాశుక్లా విజ్ఞప్తి చేశారు.

ఉద్యమాలకు సిద్ధం కావాలి

-సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగరావు

ప్రజాశక్తి - కాకినాడ

కార్మిక హక్కుల రక్షణకు సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్. నర్సింగరావు పిలుపు ఇచ్చారు. సిఐటియు రాష్ట్ర 16వ మహాసభ ఈనెల 2, 3, 4 తేదీల్లో భీమవరంలో జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 3 ప్రాంతాల నుండి గత ఏడాది డిసెంబర్ 28న కార్మిక చైతన్య యాత్రలు ప్రారంభమయ్యాయి. దానిలోభాగంగా శ్రీకాకుళం జిల్లా మందసలో ప్రారంభమైన యాత్ర శనివారం మధ్యాహ్నం కాకినాడ చేరుకుంది. ఈ సందర్భంగా కాకినాడ సిఐటియు ఆధ్వర్యంలో అనుబంధ సంఘాల కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వ శేషబాబ్జీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నర్సింగరావు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పూర్తిగా యజమానుల కొమ్ముకాస్తూ కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును కారుచౌకగా విదేశీ కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారని దుయ్యబట్టారు. స్వాతంత్య్ర పోరాట కాలం నుండి భారత కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను, లేబర్ కోడ్‌లు మారుస్తున్నారని, దీనివల్ల కార్మికులకు ఉన్న కొద్దిపాటి హక్కులు కూడా లేకుండా పోతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలు సవరించకుండా యజమానులకు వత్తాసు పలుకుతుందని విమర్శించారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని సిఐటియు డిమాండ్ చేస్తుందన్నారు. సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి. బేబిరాణి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. కాకినాడ జిజిహెచ్ వంటి సంస్థల్లో పి.ఎఫ్., ఈఎస్ఐ యజమానులు చెల్లించవలసిన వాటా కూడా కార్మికుల జీతాల నుండే మినహాయించడం చాలా దారుణమన్నారు. పిఎఫ్ అధికారులు సూపరింటెండెంట్‌కు నోటీస్ ఇస్తే కాంట్రాక్టర్ కార్మికులను బెదిరిస్తున్నారని, అధికారులు జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలని లేనిపక్షంలో ఉద్యమం తప్పదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, కోశాధికారి మలక వెంకట రమణ, ఆశా వర్కర్స్ యూనియన్ నేత చంద్రమళ్ళ పద్మ, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు ఎం.రమణమ్మ, మెడికల్ రెప్స్ యూనియన్ కార్యదర్శి ఎ.ఆర్.సి. వర్మ తదితరులు మాట్లాడుతూ కార్మిక హక్కుల రక్షణకు సిఐటియు రాష్ట్ర మహాసభలో చర్చించి రూపొందించిన కార్యాచరణను అమలు చేస్తామన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు నాయకులు రాజా, వరహాలు తదితరులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు అమ్మినాయుడు, కాకినాడ నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, సిహెచ్. విజయకుమార్, సి.వెంకట్రావు, దుంపల ప్రసాద్, ఎం.హరనాథ్, టి. నీరజ, ఎంకెఎం జ్యోతి, భారతి, నాగలక్ష్మి, వేణు, గాంధీ, అర్జున్, తుపాకుల వీర్రాజు, పాలిక రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన గీతాలు అలరించాయి.

సమస్యలు పరిష్కరించకుంటే 'పట్టాభి' గేటు ముందే దీక్షలు

పెద్దాపురం పట్టాభి ఫుడ్స్ అగ్రో ఇండస్ట్రీస్ లో తొలగించిన కార్మికులకు న్యాయం చేయకపోతే పరిశ్రమ గేటు ముందే దీక్షలు చేపడతామని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నరసింగరావు అన్నారు.



పెద్దాపురం పట్టాభి పరిశ్రమ గేటు ముందు ప్రసంగిస్తున్న నరసింహారావు, సిఐటియు నాయకులు

సిఐటియు రాష్ట్ర మహాసభల సందర్భంగా శ్రీకాకుళం జిల్లా మందస నుండి ప్రారంభమైన కార్మిక చైతన్య యాత్ర జాతా శనివారం పెద్దాపురం చేరుకుంది. జాతా కు సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు ఘన స్వాగతం పలికారు. స్థానిక మున్సిపల్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి నర్సింగరావు, సిఐటియు అఖిలభారత ఉపాధ్యక్షులు జి.బేబీ రాణిలు నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ సెంటర్ నుండి మెయిన్ రోడ్డు మీదుగా వాలు తిమ్మాపురం రహదారిలోని లలిత ఎంటర్ప్రైజెస్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టాభి అగ్రో ఫుడ్స్ వద్ద కార్మికులనుద్దేశించి నరసింగరావు ప్రసంగించారు. పట్టాభి కార్మికులకు న్యాయం జరిగేంత వరకు సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయమని అడిగినందుకు యాజమాన్యం కార్మికులను ఉద్యోగాల నుండి తొలగించటం అన్యాయమన్నారు. యాజమాన్యం కార్మికులకు న్యాయం చేయకపోతే గేటు ముందు నిరాహార దీక్షలు చేస్తామని ప్రకటించారు. ఈనెల 2న భీమవరంలో జరిగే బహిరంగ సభకు సీఐటీయూ ఆధ్వర్యంలో అన్ని విభాగాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు గడిగట్ల సత్తిబాబు, క్రాంతి కుమార్, సిరపరపు శ్రీనివాస్, ఉమామహేశ్వరి, నీలం శ్రీను, వడ్డి సత్య నారాయణ, చింతల సత్యనారాయణ, తాడిశెట్టి గంగాధర్, పద్మ,దేవి, రామారావు, శ్రీను, రమణ, అప్పారావు, భద్రరావు, రమణ, లోవకుమారి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా కన్వీనర్ కేదారి నాగు, మండల కార్యదర్శి రొంగల వీర్రాజు, ప్రజానాట్య మండలి కళాకారులు దారపు రెడ్డి కృష్ణ, మహాపాతిన రాంబాబు, దారపురెడ్డి సత్యనారాయణ, కూనిరెడ్డి అప్పన్న, నరసింహామూర్తి, సత్తిబాబుల బృందం కార్మిక గీతాలాపనతో ఉత్తేజపరిచారు.



చొల్లంగి గురుకుల పాఠశాల విద్యార్థులకు టాబ్‌లు ఇస్తున్న ఎంఎల్‌ఎ పొన్నాడ

విద్యార్థులకు ట్యాబుల పంపిణీ

ప్రజాశక్తి- రౌతులపూడి

మండలంలోని బలరామపురం. ములగపూడి జడ్‌పి ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ట్యాబులను జడ్‌పిటిసి గొల్లు లక్ష్మణ్మూర్తి. ఎంపిపి గంటి మల్ల రాజ్యలక్ష్మి శనివారం అంద జేశారు. ఎంఇఒ ఎస్‌వి నాయుడు మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు చింతకాయల వీర వెంకట సత్యనారాయణ, సర్పంచ్ దాసరి తాతాజీ, ఎంపిటిసి సోమరౌతు రవి, హెచ్ఎం అయిత రామకృష్ణ, చిట్టమ్మ ఉన్నారు. **పెద్దాపురం** మండలం వడ్లమూరులోని ఎంపిపి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. హెచ్ఎం గిరి, కంటే వీర రాఘవరావు, ఉప సర్పంచ్ చల్లా రామాంజనేయులు, అభివృద్ధి కమిటీ చైర్మన్ కంటే పరిమళ పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండలం చొల్లంగి గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, ఎంపీపీ రాయుడు సునీత, కుడుపూడి శివన్నారాయణ దున్న జనార్దన రావు, కె.గోవింద కుమార్, రాయుడు గంగాధర్, వై. కుటుంబరావు మాసా శ్రీనివాస్, మైదు సత్యరావు పాల్గొన్నారు.

రూ. 3.63 లక్షల సరుకు జప్తు

జెసి కోర్టు ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వ, రవాణాబీ రైస్ మిల్లులు, పెట్రోలు బంకులు తదితరాలు నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి 2022, డిసెంబర్ 24, 31 తేదీల్లో నిత్యావసరాల చట్టం-1955, సెక్షన్ 6ఏ కింద నమోదైన 11 కేసులను విచారించి, సీజ్ చేసిన రూ. 3,63,192ల సరుకును ప్రభుత్వానికి జప్తు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు కాకినాడ జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలాక్కియ శనివారం ప్రకటనలో తెలిపారు. ఓ వాహన యజమానికి రూ.50 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. నలుగురిపై ఎఫ్ఐ ఆర్ నమోదుకు ఉత్తర్వులు జారీ చేశామన్నారు.

2న కలెక్టరేట్‌లో స్పందన

ప్రజాశక్తి - కాకినాడ

2023 జనవరి 2 తేదీ సోమవారం స్పందన ప్రజా విజ్ఞాపన స్వీకరణ కార్యక్రమం ఉదయం 9:30 నుంచి స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ కృతికా శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంశాన్ని అర్జీదారులు, జిల్లా అధికారులు గమనించాలని ఆమె కోరారు.

నెలాఖరులోగా సర్వే పూర్తి

ప్రజాశక్తి - కాజులూరు

జగనన్న సంపూర్ణ భూ సర్వే ఈ నెలాఖరులోగా పూర్తవుతుందని కాకినాడ డివిజన్ సర్వే ఉప అధికారి కె.అప్పారావు తెలిపారు. శనివారం మండలంలోని గొల్లపాలెం, జగన్నాధగిరి గ్రామాలలో సర్వే ప్రక్రియను పరిశీలించారు. మండలంలోని అండ్రంగి, మంజేరు, ఆర్యవటం, తర్లంపూడి తదితర గ్రామాల్లో రికార్డులను పరిశీలిస్తున్నామన్నారు. కోలంకలో సర్వే ప్రారంభించాల్సి ఉందని ఆయన తెలిపారు.

కార్టూన్ 'నిజం'



అది మనం చూడం కద్సార్..!!!



అధికారుల వైఖరిపై మూకుమ్మడిగా ప్రశ్నిస్తున్న వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

అధికారుల తీరుపై కౌన్సిల్ ఆగ్రహం

ప్రజాశక్తి - సామర్లకోట

మున్సిపాల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సమావేశంలో అధికారులు, సచివాలయ సిబ్బంది ఆకస్మిక సెలవులు, పట్టణంలో చేపట్టాల్సిన అభివద్ధి పనులపై మున్సిపల్ అధికారుల నిర్లక్ష్య వైఖరిని తప్పుపడుతూ అధికార పక్ష కౌన్సిలర్లు ప్రతిపక్షంగా వ్యవహరించి ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలుత జరిగిన జీరో అవర్‌లో సీనియర్ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్ మాట్లాడుతూ సచివాలయం అధికారుల పని తీరు దారుణంగా మారిందన్నారు. దీర్ఘకాలిక సెలవులపై వెళుతూ ఇష్టానుసారంగ వ్యవహరించడంతో ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. వీలైతే సచివాలయ సిబ్బందిని, వార్డు వాలంటీర్లను పై వేరే వార్డులకు మార్పు చేయాలని వారు డిమాండ్ చేశారు. సచివాలయ సిబ్బందితో మున్సిపల్ కమిషనర్ ప్రతివార్డుల్లోను సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజా సమస్యలపై తక్షణం స్పందించే విధంగా స్థానిక కౌన్సిల్ సభ్యులతో అనుసంధానం చేయాలని కోరారు. సమావేశంలో నాలుగో వార్డ్ కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు ఆమోదించే అంశంపై గత రెండు సమావేశాల్లో వాటిపై వివరాలు కోరగా ఎందుకు వాటిని తెలుపలేదని ప్రశ్నించారు. సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన అంశాలను రికార్డ్ చేస్తున్నారా, లేదా, రికార్డు చేస్తే వాటిని చూపించాలని డిమాండ్ చేశారు. దానికి ఏఇ అరవింద్ మాట్లాడుతూ కొన్ని వార్డులకు సంబంధించిన పనులను పరిశీలించామని, కొన్ని పనుల పరిశీలన ఇంకా పూర్తి కాలేదని వివరణ ఇచ్చారు. దానిపై కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, నేతల హరిబాబు, కాళ్ళ శ్యామల తదితరులు మాట్లాడుతూ తమ వార్డులో పనులకు సంబంధించి పరిశీలనకు తమకు ఎలాంటి సమాచారం అందలేదని చైర్పర్సన్‌కు ఫిర్యాదు చేశారు. 31వ వార్డు కౌన్సిలర్లు సేపేని సురేష్ మాట్లాడుతూ అన్ని వార్డులో ఒకే విధంగా పారిశుధ్య కార్మికుల నియామకం జరగలేదని. తమ వార్డులో ఒక డ్రెయిను, ఒక రహదారి పనులు ఏడాది టెండర్లు కూడా పిలిచిన దాఖలాలు లేవన్నారు. తమ వార్డులో మహిళలకు సంబంధించిన మరుగుదొడ్ల సమస్యతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని ఎప్పటికి పరిష్కరిస్తారని మున్సిపల్ చైర్ పర్సన్ అరుణ కష్ణమూర్తి, కౌన్సిలర్ రెడ్నం సునీతలు కమిషనర్‌ని ప్రశ్నించారు. గతంలో చేపట్టిన పనుల రేటిపైకి సంబంధించి కౌన్సిల్ సమావేశాల్లో సభ్యులు అభ్యంతరం తెలిపి వాయిదాలు వేస్తున్న మూడుసార్లు సమావేశంలోనికి అంశాన్ని తీసుకువచ్చి కౌన్సిల్ సభ్యులతో సంబంధం లేకుండా బిల్లులు చేసుకునేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటప్పుడు కౌన్సిల్ ఆమోదం దేనికని కౌన్సిలర్లు పెట్టా సత్యనారాయణ, జట్ల మోహన్ తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డుల్లో పందుల సమస్యపై ప్రజలు తమను ప్రశ్నిస్తున్నారని కౌన్సిలర్ కాళ్ల శ్యామల ప్రశ్నించారు. దానికి చైర్ పర్సన్ వివరణ ఇస్తూ జనవరి 20వ తేదీ వరకు పందుల యజమానులకు గడువు ఇచ్చామన్నారు. ఆలోగా వారి సొంత స్థావరాలకు పందులను మళ్లించకుంటే వారిపై చర్యలు చేపట్టనున్నట్టు స్పష్టం చేశారు. అనంతరం జరిగిన అజండా చర్చలో మొదటి అంశాన్ని కౌన్సిల్ సభ్యులంతా ఏకగ్రీవంగా వాయిదా వేయాలని కోరారు. మిగిలిన అంశాలు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించడంతో సమావేశాన్ని ముగించారు. సీనియర్ కౌన్సిలర్ పితాని కష్ణ, తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ బలుసు వాసు తదితరులు మాట్లాడగా మున్సిపాల్ డిఈ హుస్సేన్, కమిషనర్ నయీమ్ అహ్మద్, అన్ని శాఖల అధికారులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.



పోడియం వద్ద కౌన్సిలర్‌లు నగేష్, వరలక్ష్మిల వాగ్వాదం

అజెండాలోని అభివృద్ధి పనుల వాయిదా

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక మిరపకాయల వీధిలో నూతనంగా వేస్తున్న సిమెంట్ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణంపై అధికార ప్రతిపక్ష కౌన్సిలర్ మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. పిఠాపురం కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యవతి అధ్యక్షతన కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు. అజెండా ప్రారంభంలో 13వ వార్డ్ కౌన్సిలర్ తలిశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎజెండాలోని ఒకటి నుంచి 15 వరకు 19 నుండి 43 వరకు అంశాలను వాయిదా వేయాలన్నారు. పలు అభివృద్ధి పనులలో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదని, పనులు జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తూ ఈ అభివృద్ధి పనులను ఒక నెలపాటు వాయిదా వేయాలన్నారు. దాంతో కౌన్సిల్ ఏక మొత్తంగా ఆయా అంశాలను వాయిదా వేస్తూ తీర్మానం చేసింది. 18 అంశం చెత్త సేకరించే విషయమై 10వ వార్డ్ కౌన్సిలర్ అల్లవరపు నగేష్ మాట్లాడుతూ గత కౌన్సిల్ నుంచి చెత్త సేకరించే వాహనాలపై ప్రశ్నించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ తిరుమల మాట్లాడుతూ చిన్న చెత్త సేకరణ వాహనం మరమ్మతులు పూర్తయి విశాఖపట్నం నుంచి వస్తుందని, పెద్ద వాహనికి మరమ్మతులు జరుగుతున్నాయని తెలిపారు. కౌన్సిలర్ బొజ్జ జగదీశ్వర్ స్థానిక చిన్నమాంబ పార్కు ప్రహరీ గోడ తొలగించి నిర్మాణం పూర్తి చేయటం లేద, పార్కును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు మిరపకాయలు వీధిలో రోడ్డు వేసేందుకు డ్రెయిన్ వేసేందుకు అధికారులు ఇరువైపులా నివాసాల మెట్లు తవ్వేశారని ఇవి ఎవరు కట్టిస్తారని రోడ్డు వేసి డ్రెయిన్ వేయడం లేదనికౌన్సిలర్ అల్లవరపు నగేష్ అధికారులను నిలదీశారు. దీనిపై అరిగెల వరలక్ష్మి మాట్లాడుతూ నువ్వే ప్రజల్ని రెచ్చగొడుతున్నావని నగేష్‌పై ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఇద్దరి మధ్య పోడియం ముందు వాగ్వాదం గందరగోళానికి దారి తీసింది.. కౌన్సిల్ సభ్యులు కలుగజేసుకుని వివాదాన్ని సద్దుమణిగేలా చేశారు. బొజ్జ జగదీశ్వరి మాట్లాడుతూ పట్టణంలో ఎన్ని ఖాళీ స్థలాలు ఉన్నాయని వాటి పరిరక్షణకు వాటి వివరాలు కౌన్సిల్ సభ్యులందరికీ ఇవ్వాలని కమిషనర్‌ను కోరారు. దీనిపై కమిషనర్ మాగాపు రామ్మోహన్ మాట్లాడుతూ పట్టణంలో 60 ఖాళీ స్థలాలు గుర్తించామని నిధులు సమకూర్చి వాటికి సంరక్షణగా ప్రహరీలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. నగేష్ మాట్లాడుతూ పట్నంలో ఖాళీ స్థలాలు అమ్ముకోవడానికి టౌన్ ప్లానింగ్ అధికారి దళారిగా వ్యవహరిస్తున్నారని ఆక్రమణలన్నీ ఎక్కడికక్కడే కొనసాగుతున్నాయని అధికారులు చర్య మాత్రం శూన్యమని ఆరోపించారు. సమావేశంలో డీఇ భవాని శంకర్, ఎఇ వంశీ అభిషేక్ మేనేజర్ జయరాం, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

గణిత చదరంతో2023కి స్వాగతం

సాయి వంశీ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్



విశాఖపట్నం గాయత్రి విద్య పరిషత్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న సామర్లకోట మండల పెద్ద బ్రహ్మదేవంచెందిన తోటకూర వి.ఎస్.ఎస్. సాయి వంశీ తన ఆనవాయితీ ప్రకారం నూతన సంవత్సరానికి ఎటు కూడిన "2023"వచ్చే విధంగా గణిత చదరం రూపొందించి తన శుభా కాంక్షలు తెలుపుతూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సాయి వంశీ మాట్లాడుతూ తనకు ఇష్టమైన గణిత చదరం ద్వారా కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఈ 2023 లో అందరికీ మేలు జరగాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. గణిత సూత్రం తెలిస్తే ఎవరైనా ఈ రకంగా మాయా చదరాలు రూపొందించవచ్చు నని తద్వారా కష్టం అనిపించే గణితం పై పట్టు సాధించడం ద్వారా ఇష్టపడి చదవాలనే కోరిక కలుగుతుందని వంశీ తెలిపారు. మాయ చదరం:నిలువు వరుసల లోని అంకెల మొత్తం 2023, అడ్డ వరుస లోని అంకెల మొత్తం2023 కర్ణాల మొత్తం 2023 వచ్చేలా పలు విధాలుగా ఏ నాలుగు సంఖ్యలు కూడిన మొత్తం 2023 వచ్చే విధంగా రూపొందించి సాయి వంశీ స్వాగతం పలికారు.

512	498	509	504
508	505	511	499
502	507	500	514
501	513	503	506

సాయి వంశీ రూపొందించిన గణిత చదరం

విఆర్ఒ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాజులూరు

తీవ్ర అస్వస్థతకు గురై కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కోలంక విఆర్ఒ సాదు పుల్లయ్య ఆపరేషన్ నిమిత్తం ఆయన భార్య లక్ష్మికి తహశీల్దార్ సత్యనారాయణ, విఆర్ఒలు రూ.25 వేల సాయం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, విఆర్ఒలు పరామర్శించారు.

అంబేద్కర్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కరప

సవిలే ఫౌండేషన్ అధ్యక్షుడు సవిలే రాజేష్ రూపొందించిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 2023 నూతన క్యాలెండర్‌ను శనివారం కరప ఎంపిపి కార్యాలయంలో ఎంపిపి పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు, జడ్‌పిటిసి యాళ్ల సుబ్బారావులు ఆవిష్కరించారు. డిప్యూటీ తహశీల్దార్ అనిల్, పొన్నమండ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతి లోహిదాస్, సవిలే నీలిమరాజేష్, వాసంశెట్టి శ్రీనివాస్, వి.ఒ.పి.ఆర్.డి. శ్రీనివాస్, ఆర్.ఐ మాచరావు సాదే వీరరాఘవులు, అప్పారావు, వెంకట రమణ పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన జాయింట్ కలెక్టర్ ఇలాక్కియ

వికాస ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - కాకినాడ

వికాస, జిజిహెచ్‌ల ఆధ్వర్యంలో వికాస కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన ఈ రక్తదాన శిబిరాన్ని జాయింట్ కలెక్టర్ ఇలక్కియ ప్రారంభించారు. కాకినాడ జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ బి. హేమలత పర్యవేక్షణలో జిజిహెచ్ వైద్యాధికారి డాక్టర్ డి.శారదాదేవి సహకారంతో సుమారు 45 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వికాస పీడీ కె.లచ్చారావు మాట్లాడుతూ ఆరు నెలలకు ఒకసారి నిర్వహించే రక్తదానం శిబిరంలో తమ ట్రైనింగ్ సెంటర్ అభ్యర్థులు రక్తదానం చేశారన్నారు. కార్యక్రమంలో కాకినాడ జిజిహెచ్ సిబ్బంది, వికాస మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ముఖ్య అతిథులు

ఉత్సాహంగా స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి - పెద్దాపురం

యువ చైతన్య సేవా సమితి, నెహ్రూ యువ కేంద్ర యువజన వ్యవహారాలు, తూర్పుగోదావరి జిల్లా క్రీడా మంత్రిత్వ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక లూథరన్ హైస్కూల్లో శనివారం ఉత్సాహ భరిత వాతావరణంలో పెద్దాపురం - కిర్లంపూడి బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ, 200 మీటర్ల పరుగు పందెం, షార్ట్ పుట్టు పోటీల్లో యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలు ముగిసిన అనంతరం శనివారం సాయంత్రం యువ చైతన్య సేవాసమితి అధ్యక్షులు నల్లా లీలా వినోద్ కుమార్ అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో ముఖ్య అతిథులుగా లూథరన్ హెచ్ఎం ఎన్.పిలిప్‌రాజ్, కరస్పాండెంట్ జి.నళినిలు పాల్గొన్నారు. సేవా సమితి కార్యదర్శి పోకల రాధా శ్రావణి మాట్లాడుతూ వాలీబాల్ పోటీలో జి .రాగంపేట జట్టు విన్నర్స్ గా, పెద్దాపురం ఎస్సీ బాలుర హాస్టల్ జట్టు రన్నర్స్ గా విజయం సాధించారన్నారు. కబడ్డీ పోటీలో లూథరన్ హైస్కూల్ జట్టు విన్నర్స్ గా, శ్రీ వీర్రాజు హైస్కూల్ జట్టు రన్నర్స్‌గా నిలిచారన్నారు. షాట్‌పుట్‌లో విశివ(కిర్లంపూడి), రన్నింగ్‌లో పి.ప్రసాద్, ఎం హారిక, ఇమ్రాన్, ఎస్ కే గౌశిక్ లు విజయం సాధించారన్నారు. విజేతలకు ఎన్ పిలిప్ రాజ్, జి నలిళినులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పోకల మణిమాల,బోర్డు సభ్యులు తోట రీతిన,పోకల సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

చదువుతోపాటు ఆరోగ్యంపై కూడా విద్యార్థులు శ్రద్ధ వహిస్తూ, తగు జాగ్రత్తలు తీసుకోవాలని రాజపూడి ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ గౌతమి సూచించారు. జగ్గంపేట గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరికి పరీక్షలు నిర్వహించారు. ప్రతి గురువారం ఐరన్ మాత్రలను తీసుకోవాలని ఆమె సూచించారు. హెచ్ఎం రాజకుమారి, డాక్టర్ గౌతమిని అభినందించారు.

ఖోఖో టోర్నీ ఏర్పాట్లపై విసి సమీక్ష

ప్రజాశక్తి – కాకినాడ

జెఎన్‌టియుకె ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియంలో ఈనెల 9 నుండి 12వ తేదీ వరకు నాలుగురోజుల పాటు నిర్వహించనున్న సౌత్ జోన్ ఇంటర్-యూనివర్శిటీ ఖో-ఖో (మెన్) టోర్నమెంట్ నిర్వహణా ఏర్పాట్లపై శనివారం ఉపకులపతి జివిఆర్.ప్రసాద రాజు అధికారులతో సమీక్షించారు. యూనివర్శిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ జి.శ్యామ్‌కుమార్ టోర్నమెంట్ నిర్వహణ, క్రీడాకారులకు కల్పిస్తున్న వసతులు తదితర ఏర్పాట్లపై అధికారులకు వివరించారు. ఉపకులపతి ప్రసాదరాజు మాట్లాడుతూ ఆల్ ఇండియన్ యూనివర్శిటీస్ (ఏఐయు), న్యూఢిల్లీ నిబంధనలతో జెఎన్‌టియుకె ఆధ్వర్యంలో ఈ టోర్నీ మెంట్‌ను విజయవంతంగా నిర్వహించాలన్నారు. టోర్నమెంట్ నిర్వహణకు కమిటీలు కన్వీనర్లతో పాటు సభ్యులను కూడా నియమించుకున్నారు. కమిటీలకు అప్పగించిన బాధ్యతలను నిర్వహించాలన్నారు. కమిటీలకు ఛైర్మన్‌గా విసి ప్రసాదరాజు, వైస్ ఛైర్మన్ రెక్టార్ కెవి.రమణ, కోఆర్డినేటర్‌గా రిజిస్ట్రార్ ఎల్.సుమలత, కన్వీనర్‌గా డైరెక్టర్ అకడమిక్ ఆడిట్ %ఎం యుజిఎస్ ఇన్చార్జి డైరెక్టర్ కెవిఎస్. సాయిబాబు, నిర్వహణా కార్యదర్శిగా యూనివర్శిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ డా.జి.శ్యామ్‌కుమార్‌లు వ్యవహరిస్తున్నట్లు రిజిస్ట్రార్ సుమలత తెలిపారు. సమావేశంలో ఓఎస్డి డి.కోటేశ్వరరావు, డైరెక్టర్లు, యుసిఇకె ప్రిన్సిపాల్, ప్రత్యేకాధికారులు, విభాగాధిపతులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకుంటున్న విజేతలు

'నన్నయ' ఇంటర్ యూనివర్సిటీ క్రీడలు ప్రారంభం

ప్రజాశక్తి – కాకినాడ కార్పొరేషన్

కాకినాడ స్థానిక డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ (గ్రౌండ్)లో ఆదికవి నన్నయ ఇంటర్ యూనివర్సిటీ క్రీడాపోటీలను శనివారం ప్రారంభమయ్యాయి. శనివారం జరిగిన ఖో ఖో ఈవెంట్‌లో కాకినాడ ఐడియల్ డిగ్రీకళాశాల జట్టు మొదటి స్థానం, రాజమహేంద్రవరం గవర్నమెంట్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాల జట్టు ద్వితీయ స్థానం, ఏలూరు సిఆర్ రెడ్డి కళాశాల జట్టు మూడవ స్థానం సాధించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎస్ అండ్ పీజీ క్యాంపస్ ప్రిన్సిపాల్ కమల కుమారి, ఈస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ ఐఓఏ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోడూరి వీర రామచంద్ర మూర్తి, ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ ప్రత్యూష జలగం, పిఠాపురం సూర్యరాయ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ మహమ్మద్ రాజీ, డైరెక్టర్ నూర్జహాన్ బేగం హాజరయ్యారు. యూనివర్సిటీ తరుపున స్పోర్ట్స్ బోర్డ్ నిర్వహణ కార్యదర్శిగా మొహమ్మద్ హబీబ్ బాషా, యూనివర్సిటీ అబ్జర్వర్‌గా ఎ.సత్యనారాయణ వ్యవహరించారు. పిఠాపురం సూర్యరాయ డిగ్రీ కళాశాల యాజమాన్యం కోసిన్సాలెంట్ మొహమ్మద్ చాంద్ బాషా అన్ని కళాశాలల విద్యార్థులకు భోజన-వసతి కల్పిస్తూ క్రీడలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు.

లైంగిక వేధింపులపై విచారణ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

జి. మేడపాడు జడ్‌పి హైస్కూల్ సోషల్ టీచర్ ఎస్.వెంకటరమణ ప్రవర్తనపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి శనివారం జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఆర్‌జె. డేనియల్‌రాజు, బాలికా శిశు అభివృద్ధి అధికారి క్షేమాబాయిలు విచారణ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం జి.మేడపాడులో గడప గడపకు కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్, పెద్దాపురం నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబుకు జడ్‌పి పాఠశాల విద్యార్థిని తల్లి సోషల్ టీచర్ ప్రవర్తనపై ఫిర్యాదు చేయడంతో దానిపై ఆయన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు, డిఇఒకు ఫోన్‌ద్వారా సమాచారం ఇచ్చారు. ఈ మేరకు శనివారం పాఠశాలకు చేరుకున్న అధికారుల బృందం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి లిఖిత పూర్వకంగా సమాచారం సేకరించారు. కార్యక్రమంలో ఎంఇఒ వై.శివరామకష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ ఆరోపణలపై సామర్లకోట సీఐ కె.దుర్గా ప్రసాద్ పాఠశాల విద్యార్థుల నుండి సమాచారం సేకరించారు.

ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్

ప్రజాశక్తి – పెదపూడి

ప్రజలందరికి స్వచ్ఛమైన తాగునీరు. అందించాలనే లక్ష్యంతో ప్రతి ఇంటికి కుళాయి కనక్షన్ ఏర్పాటు చేస్తున్నామని ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్య నారాయణ రెడ్డి అన్నారు. వేంద్రలో శనివారం జలజీవన్ మిషన్ నిధులు రూ.29.54 లక్షలతో ప్రతి ఇంటికి కుళాయి కనక్షన్, సంపరలో నాడు నేడు పథకంలో రూ.41.75 లక్షలతో పాఠశాల భవన నిర్మాణ పనులకు ఎంఎల్ఎ శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ కేతా తులసి, జడ్‌పిటిసి పేపకాయల వెంకటలక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, సంపర సర్పంచి అద్దంకి మాచరమ్మ, ఎంపీటీసీ సభ్యుడు. ఆదినారాయణ, మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ నర్ల సాంబమూర్తి, సొసైటీ డైరెక్టర్ పేపకాయల సూర్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, గ్రామ కన్వీనర్ ఎలుగుబంటి వెంకన్న పాల్గొన్నారు.

పార్కుల నిర్మాణాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి – కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో రూ 1.40 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులతో ప్రతిపాదించిన రెండు పార్కుల నిర్మాణానికి కాకినాడ సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. స్థానిక శారదా దేవి ఆలయ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన 80 అడుగుల రహదారి వద్ద కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రిజర్వ్ పోలీస్ లైన్, చీడిలపోర ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం ఈ పార్కులను నిర్మించనున్నారు. కార్యక్రమంలో కౌడా ఛైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి కుమార్, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, ఎడిసిసిహెచ్ నాగ నరసింహారావు, కార్పొరేషన్ ఎస్ఇ పి.సత్య కుమారి, డిఇ సుబ్బారావు, సుంకర విద్యాసాగర్, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నగర పంచాయతీ అభివృద్ధే లక్ష్యం


ప్రజాశక్తి -ముమ్మిడివరం


ఎంఎల్ఎ సతీష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ముమ్మిడివరం నగర పంచాయతీ అభివృద్ధే లక్ష్యమని ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. నగర పంచాయతీ 2023- 24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ సమావేశం ఛైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఎల్ఎ సతీష్‌కుమార్, ఎంపీ చింతా అనురాధ హాజరయ్యారు. ఎంఎల్ఎ సతీష్ కుమార్ మాట్లాడుతూ నగర పంచాయతీలో డ్రెయిన్ వ్యవస్థను మెరుగుపరచాలన్నారు, అలాగే టౌన్ ప్లానింగ్ విషయంలో ఎవరూ రాజీ పడొద్దు అని నిబంధనలు ప్రకారమే జరగాలన్నారు. నియోజకవర్గ కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న అంబేద్కర్ భవన్ కు రూ.50 లక్షలు నిధులు మంజూరు చేయించామన్నాయరు. ఎంపీ చింతా అనురాధ మాట్లాడుతూ అభివద్ధి విషయంలో అధికార ప్రతిపక్ష నాయకులు సమస్యలను సభలో చర్చించడం మంచి పరిణామం అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీకి అభివద్ధికి రూ.20 లక్షలు నిధులు మంజూరు చేశామన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌కు మరొక రూ.20 లక్షలు నిధులు కేటాయిస్తున్నట్లు హామీ ఇచ్చారు. అంతకు ముందు కౌన్సిల్ సమావేశంలో 2023- 24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రతులు సభలో చదివి వినిపించారు. అనంతరం ఎంపీ చింతా అనురాధన, ఎమ్ఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్‌లను నగర పంచాయతీ ఛైర్మన్ తో పాటు వార్డు కౌన్సిలర్లు ఘనంగా సన్మానించారు. సమావేశంలో నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు, వివిధ అధికారులుపాల్గొన్నారు.

మంచుతో ప్రయాణికుల అవస్థలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం


మంచులోని ప్రయాణిస్తున్న వాహనదారులు

మండలంలోని గ్రామాల్లో శనివారం మంచి దుప్పటి కమ్మేసింది. దీంతో ఉదయం 11 గంటల వరకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రైతులు తమ పండించిన పంటలను రావులపాలెం మార్కెట్‌కు తరలించేందుకు అవస్థలు ఎదుర్కొన్నారు. అలాగే వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే యాత్రికులు మంచు కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

గోదారి గలగలలు

పెన్షన్... టెన్షన్..

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

అందరూ నూతన సంవత్సర వేడుకల్లో సంతోషంగా ఉండగా సామాజిక పింఛన్లు అందుకుంటున్న లబ్ధిదారులు మాత్రం విషన్నవదనాలతో నూతన సంవత్సరంలోకి అడుగు పెడుతున్నారు. పెన్షన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పెడుతున్న టెన్షనే దీనికి కారణం. ఒక పక్క జనవరి నుంచి పింఛన్లను పెంచుతున్నామంటూ ప్రకటించిన ప్రభుత్వం.. మరో పక్క నిబంధనల పేరుతో లబ్ధిదారులను తగ్గించే కుట్ర పన్నుతోంది. ఇప్పటికే కొంత మంది లబ్ధిదారులకు నోటీసులు అందించింది. అందులో సవాలక్ష నిబంధనలు పెట్టింది. వాటికి సంబంధించిన పత్రాలు సచివాలయంలో అందిస్తే అర్హత బట్టి పింఛను యథావిధిగా మంజూరు చేస్తామని అధికారులు చెబుతున్నారు. కాని అధికారుల మాటలు ఎంతవరకూ నమ్మాలో కూడా తెలియని పరిస్థితి పింఛను దారుల్లో నెలకొంది. పింఛన్లను యథావిధిగా కొనసాగించాలంటూ సిపిఎం ఆది నుంచి కోరుతూనే ఉంది. ఈ మేరకు లబ్ధిదారులతో కలిసి ఆందోళనలు సైతం నిర్వహించింది. అధికారులకు వినతిపత్రాలు అందుకుంది. ఇదే సమయంలో వామపక్షేతర మిగిలిన పార్టీలు ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టాయి. సామాజిక పింఛన్ల తొలగింపు అధికార వైసిపి నాయకుల్లోనూ గుబులు పుట్టిస్తోంది. గడపగడపకూ మన ప్రభుత్వంలో పాల్గొంటున్న ఆ పార్టీ నాయకులకు ఇప్పుడిప్పుడే పింఛన్ల సెగ తాకుతుంది. రానున్న రోజుల్లో ఈ సెగ మరింత ఎక్కువగా తగిలే అవకాశమూ లేకపోలేదు. దీంతో అధికార పార్టీ నాయకుల్లోనూ పింఛన్ల తొలగింపుపై వ్యతిరేకత వ్యక్తమవుతుంది. ఇప్పటికే కొంత మంది ఇది అధిష్టానం దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పింఛన్ల పెంపు పథకాన్ని ప్రారంభించేందుకు ఈ నెల 3న రాజమహేంద్రవరానికి సిఎం జగన్ రానున్నారు. దీన్ని విజయవంతం చేసేందుకు వైసిపి శ్రేణులు కష్టపడుతున్నారు. ఈ సభలో పింఛన్ల రద్దుపై ఏదైనా ప్రకటన చేస్తారేమోననే ఆశతో లబ్ధిదారులు ఉన్నారు.

ఉద్యోగ, కార్మికుల నూతనోత్సాహం

సిఐటియు జిల్లా మహాసభల విజయవంతంతో ఉద్యోగ, కార్మికుల్లో నూతనోత్సాహం కనబడుతోంది. ఇప్పటికే కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లా మహాసభలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా నూతన జిల్లా కమిటీలు ఏర్పడ్డాయి. వీరందరూ రాష్ట్ర మహాసభ విజయవంతం కోసం ప్రచారంలో నిమగ్నమయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లాలో జరగబోయే రాష్ట్ర మహాసభకు వేలాదిగా తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర మహాసభ నేపథ్యంలో శ్రీకాకుళంలో మొదలైన కార్మిక చైతన్య యాత్ర ఇప్పటికే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రవేశించింది. ఈ యాత్రకు ఉద్యోగులు, కార్మికులు బ్రహ్మరథం పడుతున్నారు. యాత్రలో భాగస్వాములై ముందుకు కదులుతున్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోరాటి సాధించుకున్న చట్టాలను కోడ్‌లు మార్చిన విషయం విధితమే. దీంతో ఉద్యోగ, కార్మిక వర్గం తీవ్ర ఆందోళనవ్యక్తం చేస్తోంది. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని, ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేస్తామని ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్‌రెడ్డి పూర్తిగా బుట్టదాఖలు చేశారు. పోలీసుల సహకారంతో ఉద్యోగ, కార్మిక ఆందోళనలను అణగదొక్కేందుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ రెండు ప్రభుత్వాల విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టేందుకు వర్కింగ్ క్లాస్ సిద్ధమవుతోంది.


తుని టిడిపిలో కలకలం

తుని తెలుగుదేశం పార్టీలో కలకలం మొదలైంది. కొవ్వూరు, నిడదవోలు, రాజమహేంద్రవరంలో నెలకొన్న వర్గపోరుపై అధినేత చంద్రబాబు ఘాటుగా స్పందించిన విషయం విధితమే. అయితే తాజాగా తునిలో ఒంటిమామిడి, కోటనందూరులో ఆ పార్టీ నిర్వహించిన సమావేశాలు చర్చనీయాంశమయవుతున్నాయి. యనమల కుమార్తె రాజకీయ ఆరంగేటం చేస్తారంటూ వచ్చిన వార్తలతో అక్కడ రాజకీయ వేడెక్కింది. దీంతో అక్కడ యనమల సోదరుల మధ్య అగాధం ఏర్పడిందనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే అక్కడ టిడిపి రెండు గ్రూపులుగా విడిపోయింది. ఎన్నికల వేల టిడిపిలో వర్గపోరు పార్టీకే చేటు అని సీనియర్లు తలల పట్టుకుంటున్నారు. అయితే ఎవరు పోటీ చేసినా ఇక్కడ గెలుపు వైసిపిదే అంటూ అధికార పార్టీ నాయకులు దీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో యనమల కుటుంబాన్ని మినహాయించి వేరెవరికైనా సీటి ఇచ్చే యోచనలో అధిష్టానం ఉందనే గుసగుసలు సైతం ఇక్కడ విన్పిస్తున్నాయి. అయితే ఈ మొత్తం పరిణామాలు క్షేత్రస్థాయిలో కేడర్‌ను మరింత అయోమయానికి గురి చేస్తున్నాయి.

ప్రజల పక్షాన పోరాడే పత్రిక 'ప్రజాశక్తి'

ప్రజాశక్తి – యంత్రాగం

ప్రజల పక్షాన పోరాడే పత్రిక ప్రజాశక్తి అని పలువురు ప్రజాప్రతి నిధులు, అధికారులు అన్నారు. ప్రజాశక్తి 2023 క్యాలెండర్ ఆవిష్కరణల్లో వారు పాల్గొని మాట్లాడారు. విలువలతో కూడిన వార్తలు ఇవ్వడంలో ప్రజాశక్తి ముందుంటుందని కొని యాడారు.


చింతలమోరిలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న రాజోలు ఎంఎల్ఎ రాపాక వరప్రసాదరావు


జొన్నాడలో ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ జగ్గిరెడ్డి


నిడదవోలులో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్‌చైర్మన్, కౌన్సిలర్లు

మామిడికుదురు : ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ప్రజల పక్షాన పోరాడే పత్రిక ప్రజాశక్తి అని అమలాపురం ఎంపి చింతా అనురాధ, పి.గన్నవరం ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు కొనియా డారు. మండలంలోని నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యా లయంలో ప్రజాశక్తి క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. సమస్యలపై మంచి కథనాలను ప్రచురితం చేస్తూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా నిలబడి ప్రజాశక్తి పని చేస్తుందన్నారు. ప్రజాశక్తి క్యాలెండర్ అత్యంత నాణ్యంగా తీసుకొచ్చారని తెలిపారు. క్యాలెండర్‌ను తమతో ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివద్ధే ధ్యేయమని ఎంఎల్ఎ తనయుడు కొండేటి వికాస్ పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నక్కా కష్ణవేణి వెంకటేశ్వరరావు, వైస్ ఛైర్మన్ కొమ్ముల సత్యమణి, ఎంపిపిలు కుసుమ వనజకుమారి, దొమ్మేటి వెంకటేశ్వరరావు, నగరం పిఎసిఎస్ ఛైర్మన్ కె.ఆదిత్య, యువివి.సత్యనారాయణ మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ వి.వరలక్ష్మి, నాయకులు రాము, చిన్నబాబు, సర్పంచ్‌లు, ప్రజాశక్తి సిబ్బంది, విలేకర్లు కె.ప్రకాష్, వై.వెంకటేశ్వరరావు, జి.శ్రీనివాస రావు, ఎ.నాగరాజు, అధికారులు పాల్గొన్నారు.

నిడదవోలు : విలువలతో కూడిన పత్రిక ప్రజాశక్తి దినపత్రిక అని మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజాశక్తి-2023 క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైస్ ఛైర్మన్ యలగడ బాలరాజు మాట్లాడారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజాశక్తి పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, పువ్వుల రతీదేవి, కామిశెట్టి వెంకటసత్యనారాయణ, గోపిరెడ్డి శ్రీనివాస్, ఉసురుమర్తి జానుబాబు, దాకే అనిల్, కొత్తపల్లి సుప్రియ, మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, ప్రజాశక్తి ఏజెంట్ దిడ్ల శ్రీను, విలేకరి ఎల్లే రాజు తదితరులు పాల్గొన్నారు.


నగరంలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపి అనురాధ, ఎంఎల్ఎ చిట్టిబాబు

రాజోలు : ఉన్నత విలువలకు కట్టుబడి ఉన్న పత్రిక 'ప్రజాశక్తి' అని రాజోలు ఎంఎల్ఎ రాపాక వరప్రసాద రావు అన్నారు. శుక్రవారం మలికిపురం మండలం చింతలమోరిలో 'ప్రజాశక్తి' 2023 నూతన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజాశక్తి పత్రిక ఎప్పుడూ ప్రజల పక్షాన నిలబడుతూ ఆదరాభిమానాలను పొందిందన్నారు. రానున్న కాలంలో మరింతగా అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు.

ఆలమూరు : అనునిత్యం పేదల పక్షాన పోరాడుతూ, పేదల సమస్యల పరిష్కారానికి కషి చేస్తున్నా ప్రజాశక్తి దినపత్రిక పేదల పక్షపాతి అని, ఇది అందరికీ ఆదర్శనీయమని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని జొన్నాడ రైతు కల్యాణ మండపంలో ప్రజాశక్తి 2023 క్యాలెండర్‌ను ప్రజాప్రతి నిధులు, అధికారులు, పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తనవంతు కషి చేస్తున్న 'ప్రజాశక్తి' సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, జడ్‌పిటిసి సభ్యులు తోరాటి సీతా మహాలక్ష్మి, సర్పంచులు వనం చిన్నావతి జార్జిబాబు, గుణ్ణం రాంబాబు, ఎంపిడిఒ జాన్ లింకన్, తహశీల్దార్ లక్ష్మీపతి, ప్రజాశక్తి సిబ్బంది, విలేకర్లు కె.ప్రకాష్, గనిరాజు, బాబులు, ప్రసాద్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

27 నుండి లోకేష్ పాదయాత్ర

ప్రజాశక్తి – కాకినాడ

నారా లోకేష్ యువకులను ప్రత్యక్షంగా కలిసేందుకు ఈ నెల 27న పాదయాత్ర ప్రారంభిస్తున్నారన్నారని కాకినాడసిటీ మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు జిల్లా టిడిపి కార్యాలయంలో విలేకరులకు తెలియజేశారు. ఐటీ రంగం బలోపేతానికి ఉమ్మడి రాష్ట్రంలో నాటి టిడిపి ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు యువత వెళ్లకుండా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించిందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక అన్ని రంగాలు డీలా పడ్డాయ న్నారు. అందులో యువత ఎన్నో అవస్థలు పడుతున్నారన్నారు. ప్రతి నియోజకవర్గంలో యువతను మేల్కొలిపేందుకు యువగళం పేరుతో నారా లోకేష్ 4వేల కిలోమీటర్లు, 400రోజులు రాష్ట్రంలో పాదయాత్ర చేస్తారన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు బహిరంగ సభ పెడితే చోటు చేసుకున్న సంఘటన బాధాకరమని విచారం వ్యక్తం చేశారు కార్యక్రమంలో డా.చప్పిడి వెంకటేశ్వరరావు, నసింహదేవర విశ్వనాద్, కాకరపల్లి చలపతి రావు, వివై దాస్ కొల్లబత్తుల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టిడిపి శ్రేణులు

యువగళంతో టిడిపి మరింత బలోపేతం

ప్రజాశక్తి – ఏలేశ్వరం

యువగళంతో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం అవుతుం దని టిడిపి రాష్ట్ర ఎస్సి సెల్ అధ్యక్షులు ఎంఎస్ రాజు అన్నారు. ఈ మేరకు ఆయన ప్రత్తిపాడు అంబేద్కర్ విగ్రహం వద్ద యువగళం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ యువ గళం పేరుతో టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఈ నెల 27 నుండి నిర్వహించ నున్న పాదయాత్రకు సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చారు

పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి

ప్రజాశక్తి – అమలాపురం


మాట్లాడుతున్న రుద్రరాజు

ఎపిలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు కృషి చేస్తానని పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అన్నారు. ఆయన పిసిసి అధ్యక్షునిగా ఎన్నికైన తర్వాత తొలి సమావేశం వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ అధ్యక్షతన అమలాపురం షాధీఖాన్‌లో శనివారం నిర్వహించారు. అనంతరం రుద్రరాజును ఘనంగా సత్కరించారు. పిసిసి నాయకులు జంగా గౌతమ్, క్రిస్ట్ ఫర్ తిలక్ ,సుంకర పద్మశ్రీ, కెబిఆర్.నాయుడు, రుత్తల శ్రీ రామ మూర్తి,నాగ మధు ఆయితా బత్తుల సుభాషిణ తదితరులు పాల్గొన్నారు.

యువగళం విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి-రాజోలు

నారా లోకేష్ ఆధ్వర్యంలో ఈ నెల 27న చేపట్టనున్న యువగళం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ళ వెంకట రమణ పిలుపునిచ్చారు. శనివారం రాజోలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమణ మాట్లాడుతూ వైసిపి అధికారం చేపట్టాక రాష్ట్రంలో అన్ని వర్గాలు నిర్వీర్యమయ్యాయన్నారు.

కందుకూరు ఘటన దురదృష్టకరం

ప్రజాశక్తి -అమలాపురం రూరల్

నెల్లూరు జిల్లా కందుకూరులో టిడిపి అధినేత చంద్రబాబు ఇటీవల నిర్వహించిన బహిరంగ సభలో జరిగిన ప్రమాదం దురదృష్టకరమని ఆ పార్టీ ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పొలమూరి ధర్మపాల్ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. కందుకూరులో జరిగిన సంఘటనపై ధర్మపాల్ మాట్లాడారు. ప్రజలు ప్రస్తుత ప్రభుత్వ పాలన పోవాలని, మళ్ళీ చంద్రబాబు రావాలని ఆలోచనలో వారి బాధలు వినడానికి ఆయన ఆ ప్రాంతానికి వచ్చారన్నారు. ఆ ఆనందంతో అభిమానులు అధిక సంఖ్యలో రావడంతో అనుకోకుండా కందుకూరులో ఆసంఘటన జరిగిందన్నారు. దాన్ని రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు


కేక్ కట్ చేస్తున్న నారాయణమూర్తి సోదరులు. అభిమానులు

ఘనంగా ఆర్.నారాయణమూర్తి పుట్టిన రోజు

ప్రజాశక్తి- రౌతులపూడి

సినీ నటుడు దర్శకనిర్మాత ఆర్ నారాయణ మూర్తి పుట్టినరోజు వేడుకలను ఆయన స్వగ్రామమైన మల్లంపేటలో ఆయన కుటుంబ సభ్యులు అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు అలాగే పేదలకు దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో ఆయన సోదరులు రెడ్డి బుల్లి అబ్బాయి, రామకృష్ణ, అభిమానులు పాలుపర్తి తాతాజీ.కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

'శృంగార వల్లభుని'కి రూ 1.7లక్షల ఆదాయం

ప్రజాశక్తి – పెద్దాపురం

పెద్దాపురం మండలం తిరుపతిలోని శ్రీశృంగార వల్లభ స్వామి ఆలయాన్ని అధిక సంఖ్యలో యాత్రికులు దర్శించుకున్నారని ఆలయ ఇఒ పులి నారాయణ మూర్తి తెలిపారు. శనివారం ఒకరోజు వివిధ టిక్కెట్ల ద్వారా రూ 1,30,300, అన్నదానం విరాళాల ద్వారా రూ 44,136 ఆదాయం సమకూరిందన్నారు. యాత్రికులకు దేవస్థానం తరుపున ఉదయం పులిహోర ప్రసాదం, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. ఆలయ అర్చకులు, ప్రజా ప్రతినిధులు కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్,స్వచ్ఛంద సేవకులు,గ్రామస్తులు, సిబ్బంది కృష్ణ, మోహన్ రావు సత్యనారాయణ, అంజనీ కుమార్ సేవలందించారన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే చర్యలు

ప్రజాశక్తి – కాకినాడ కార్పొరేషన్

భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్తను నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపక్కన వేస్తే ఆయా వాహనాలను సీజ్ చేస్తామని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నర్సింహారావు హెచ్చరించారు. శనివారం ఆయన స్థానిక 9వ డివిజన్ దుమ్ములపేట సమీపంలోని కూరల మార్కెట్‌లో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. సమీపంలోని రోడ్ల పక్కన భవన నిర్మాణ వ్యర్థాలు, ఇతర చెత్తను తీసుకొచ్చి వేయడాన్ని గుర్తించారు. ఇకపై సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని, ఇష్టానుసారం వ్యర్థాలను రోడ్ల పక్కన పడవేసే లారీలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలను సీజ్ చేయడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ° ఆయన వెంట శానిటరీ సూపర్ వైజర్ జిలానీ, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్యా యత్నం

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

వాకతిప్ప గ్రామానికి చెందిన గోనెల శాంతి స్వరూప్ శనివారం సాయంత్రం గడ్డి మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శాంతి స్వరూపు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గుమస్తాగా పనిచేస్తున్నాడు. కార్యదర్శి రమణ మందలించాడని, కొండవరం గ్రామానికి చెందిన చెలికాని జగదీష్‌తోగొడవ పడడంతోపంట పొలాల మధ్యలోకి వెళ్లి తీవ్ర మనస్థాపానికి గురయ్యానని గడ్డి మందు తాగుతూ స్నేహితులతో వీడియో కాల్‌లో చెప్పి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, స్నేహితులు 108లో కాకినాడ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అతని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు .

పలు దుకాణాల్లో చోరీలు

ప్రజాశక్తి- రౌతులపూడి

రౌతులపూడిలో శుక్రవారం రాత్రి పలు దుకాణాలలో చోరీ జరిగింది. శ్రీకృష్ణుడి ఆలయం వద్ద ఓ పాన్‌షాపులో, సబ్ స్టేషన్ ఎదురుగా ఉన్న దుకాణం వద్ద, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద దుకాణంలోనూ, గిడజం వెళ్లే రహదారి వద్ద ఉన్న దుకాణంలోనూ చోరీలు జరిగాయి. శనివారం కోటనందూరు, అన్నవరం పోలీసులు చోరీకి పాల్పడిన దుకాణాలను పరిశీలించి, సిసి ఫుటేజ్‌లో చోరీకి పాల్పడిన వ్యక్తి వివరాలను సేకరించారు.